థమ్స్ అఫ్ బాటిల్‌ని ముందుపెట్టి గాభరాగా వెళ్ళిపోయాడు బేరర్. రష్ తగ్గాక నిశాంతను కలవాలని, పలకరించాలని నిర్ణయించుకుని నలువైపులా  చూస్తున్న సిద్ధార్థ.........

గబగబా ఒక వ్య క్తిలోనికి రావడం, తనకు ప్యారలల్ సీట్లో కూర్చుని బాటిల్‌ని ఓపెన్ చేయడం, ఆ బాటిల్‌ని, థమ్స్ అఫ్ బాటిల్‌ని ఖాళీచేసి........అందులో ఆ డ్రింకును పోయడమ, ఆ బాటిల్ వెనక్కి పడెయ్యడని అంతా గమనించాడు.

ఎక్సయిజ్ స్టాఫ్ లోనికొచ్చి ప్రతి గ్లాసూ, బాటిల్సూ టెస్టు చేస్తుండటంతో అయోమయంగావాళ్ళ వేపు చూస్తున్న అతనికి.......
సరిగ్గా కౌంటర్‌కి రెండడుగుల దూరంలో వున్న గ్లాస్‌డోర్ తెరుచుకోవటం అందులోంచి.....

గాభరాగా వచ్చిన నిశాంతని చూడటంతో.......

ఒకే ఒక్క క్షణం......అతని సిక్త్స్ సెన్స్ పని చేయటం ప్రారంభించింది.

నాలుగు వేపులా చూస్తున్న అతనికి.......

ఒక గోడమీద వేలాడుతున్న బోర్డ్ కనిపించింది.

"డ్రింక్స్ నాట్ ఎ లౌడ్"

మరి......మరి.....ఆ వ్య క్తి డ్రింక్ తీసుకోవడానికి అదే సమయంలో ఎక్సయిజ్ స్టాఫ్ చెకింగ్‌కి రావడానికి ఏమయినా సంబంధముందా?

సమ్‌థింగ్ రాంగ్.......

నెమ్మదిగా లేచి రామ్‌లాల్ సీటు వెనక్కి వెళ్ళి అక్కడున్న విస్కీ బాటిల్‌ని తీసి చప్పుడు కాకుండా బయటకు జారవిడిచాడు.

రామ్‌లాల్ టేబుల్ మీద విస్కీతో వున్న థమ్స్ ఆప్ బాటిల్ వేపు చూశాడు.

తన థమ్స్ అఫ్ బాటిల్‌ను అక్కడపెట్టి, ఆ బాటిల్‌ను తను తీసేస్తే?

అదంత సులభం కాదు.

మరి.......మెయిన్ స్విచ్ ఆపేస్తే?

మరింత గొడవవుతుంది.

సో............

రామ్‌లాల్ మూవ్‌మెంట్‌ని పరీక్షిస్తున్నాడతను.

ఎక్సయిజ్ ఇన్స్‌పెక్టర్ రో చివరున్నాడు.

అకస్మాత్తుగా ఓ ఐడియా తట్టిందతనికి. తన రేబాన్ గ్లాసెస్‌ని తీసికిందకు జారవిడిచాడు.

రామ్‌లాల్‌వేపు చూశాడు.

"మిస్టర్! గ్లాసెస్‌మీవా?" అలా అడుగుతున్న సిద్ధార్థవేపు చూసి, నేల మీదున్న గ్లాసెస్‌వేపు, జవాబు చెప్పకుండా వాటిని అందుకోవడానికి  కిందకు వంగాడు.

ఒకే ఒక అర క్షణం

తన థమ్స్ అప్ బాటిల్‌ని అక్కడ పెట్టేసి, ఆ బాటిల్‌ని అందుకుని గబగబా తాగడం ప్రారంభించాడతను.

రెబాన్ గ్లాసెస్‌ని కళ్ళకు తగిలించుకుని మురిసిపోతున్నాడు రామ్‌లాల్

సరిగ్గా........

అదే సమయంలో తన ముందుకొచ్చిన ఎక్స్‌యిజ్ ఇన్స్‌పెక్టర్‌వేపు చూసి నవ్వి-

థమ్స్ అఫ్ బాటిల్‌ని ముందుకు తోశాడు రామ్‌లాల్.

ఆ బాటిల్ ఖాళీగా వుంది. అప్పటివరకూ పూర్తిగా నిండుగా ఉన్న బాటిల్ అకస్మాత్తుగా ఖాళీగా ఎలా మారిందో అర్థంకాక తల గోక్కున్నాడు రామ్‌లాల్.

"వాట్ ఇన్స్‌పెక్టర్? వాటీజ్ దిస్?" తన దగ్గరకొస్తూ అడిగిన నిశాంతవేపు చూసి.......

"ఇక్కడ ఇల్లీగల్‌గా లిక్కర్‌ని ఎలో చేస్తున్నారని రిపోర్ట్ వచ్చింది అందుకని.......బట్.....అయామ్ సారీ" ముందుకడుగేశాడు యిన్స్‌పెక్టర్.

ఎందుకో విండోపక్క చూసిన నిశాంత.......

సిద్ధార్థ ముఖంవేపు విచిత్రంగా చూసింది.

ఎంతో ఫ్రెష్‌గా కనిపించే అతని ముఖం చెమటతో తడిసిపోయింది.

"నీ పేరు....నిశాంత.....కదూ కనుక్కున్నానా లేదా?" అతని నోట్లోంచి వచ్చిన మాటలు తడబడటంతో గాభరాగా అతని దగ్గరకెళ్ళి......అతని ముఖంలో చూసింది.

"మిమ్మల్నేదో......అల్లరి చేయటానికి లోనికొచ్చినట్టున్నారు......డోన్ట్‌వర్రీ .......ఎక్స్‌యిజ్ ఇన్స్‌పెక్టర్ కూలయిపోయాడుగా ....." మత్తుగా నవ్వుతూ అన్నాడతను.

"అంటే?!"

"కుర్చీ వెనక దాచిన విస్కీ బాటిల్‌ని పారేశాను థమ్స్ అప్ బాటిల్లోని విస్కీని తాగేశాను."

అమాయకంగా అంటున్న అతన్ని చూసి గిల్టీగా ఫీలయ్యింది.

కేవలం తనను రక్షించేందుకే ఎప్పుడూ తాగే అలవాటులేని అతను తాగాడని అర్థం కాగానే అతనిపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది నిశాంత మనసు.

డ్రింక్‌కి, అమ్మాయిలకి, రేసులకు, హోటల్ వ్యసనాలకు అతడు చాలా దూరం చాలా దూరంగా పెంచబడుతున్నాడు నువ్వు చేయాల్సింది- బాగా తాగించు.......ఎంతవరకో తెల్సా?

తాగుబోతు అయ్యేంతవరకు......బాగా కసెక్కించు......ఎంత వరకో తెల్సా? రోజుకో అమ్మాయి కావాలని అడిగేటంతవరకు. రేసులు, గాంబ్లింగ్ ఎంతవరకో తెలుసా? ఆస్తిని మొత్తం అచ్చే సేంత వరకు తనని శాసించిన దేశ్‌ముఖ్ ఒక్కసారి గుర్తుకొచ్చాడు నిశాంతకు.

"రండి వెళదాం" అతని భుజాల్ని పట్టుకుంది నిశాంత. అస్పర్శ ఒక్కసారి తాగిన నిషాని కిందకు దింపేసింది.

"నిశాంత! గుడ్ నేమ్.......ఐలైకిట్.....నాట్ ఓన్లీ యూ.......బట్ అల్సో యువర్ నేమ్.....యువర్ బ్యూటీ..... రియల్లీ మిస్........నిశా........."

అతన్ని రెస్టారెంటులోంచి బయటకు తీసుకొచ్చింది నిశాంత.

"నన్ను నా కారు దగ్గరకు తీసుకెళుతున్నావా........వద్దు......ఆ  బ్లూ కలర్ నా పాలిట రెడ్ కలర్..... రెడ్ సింబల్ ఫర్ డేంజర్ .........నాకు నచ్చినవాటి నుంచి దూరంగా తీసికెళ్ళిపోతుంది.......వద్దు" నెమ్మదిగా  గొణుక్కుంటున్నట్టుగా అంటున్నాడతను.

మొట్టమొదటిసారి తాగిన అతని మానసిక పరిస్థితిని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తోంది నిశాంత.

"ఇప్పటికే లేటయినట్టుంది.......మీ వార్డెన్......."

"వార్డెనా? వాడెవడు? నా ప్యాలెస్‌కి నేనే వార్డెన్‌ని.....ఒంటరి వార్డెన్........మిస్....నిశాంత......నేను నీ దగ్గర వుండ కూడదా?" అలా అడుగుతున్న అతని కళ్ళల్లోకి సూటిగా చూసిందామె.

"నా దగ్గరా! ఎందుకు?"

"ఎందుకు.......ఎందుకంటే నాకు మనసారా ఏడవాలని వుంది........చీకట్లో వంటరిగా కాదు, నడిరోడ్డు మీద......జనం మధ్య.....నీ దగ్గర........"  అతనికి నెమ్మదిగా స్పృహ తప్పిపోతోంది.

కారులోంచి పరుగెత్తుకొచ్చాడు రఘువీర్.

"ఏం జరిగింది మేడమ్?" గాభరాగా అడిగాడతను.

"రఘువీర్! నాకేం జరగలేదు. ........పద" రఘువీర్‌కి చెయ్యందించి గబగబా ముందుకు నడిచి కారెక్కాడతను.

వెళ్ళిపోతున్న కారువేపు, కారులోని సిద్ధార్థవేపు ఆయోమయంగా చూస్తూ వుండి పోయింది.

"నాకు మనసారా ఏడ్వాలని వుంది ఒంటరిగా, చీకట్లో కాదు.........నడిరోడ్లో, జనం మధ్య,నీ దగ్గర."

"అయామ్ సారీ సిద్ధార్థ...... అయామ్......సారీ ఫర్ యువర్ లోన్లీ  నెస్.....ఐ పిటీ యూ.....బట్..........."

వెంటనే దేశ్‌ముఖ్ జ్ఞాపకానికొచ్చాడు.

"బట్......ఐ కేమ్ ఫర్, డిస్ట్రాయ్ యూ" నిర్లిప్తంగా నవ్వుకుందామె.

*     *     *     *     *     *     *     *     *     *     *     *

రాత్రి రెండు గంటలు దాటింది.

చాలా సేపటివరకూ ఆలోచిస్తూ పడుకున్న నిశాంత గాఢనిద్రలో వుంది.

టెలీఫోన్ మోగింది. ఆ టెలీఫోన్ అలుపు విసుపులేకుండా అలా మోగుతూనే వుంది.

గబుక్కున మెలుకువొచ్చింది నిశాంతకు.

టెలీఫోన్ చప్పుడు ఆగిపోయింది.

మరో అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ మోగింది.

వెంటనే రిసీవర్ అందుకుంది నిశాంత.

"హలో......"

"మేడమ్.......మీ కోసమే ఎవరో వచ్చారు."

"ఎవరు?"

"మీరు కావాలని అడిగాడు.......మీతో అర్జంటుగా మాట్లాడాలిట." మాట్లోంచి కిందకొచ్చి కౌంటర్ వేపు నడిచింది ఆమె.

"ఎవరో మీ కోసమే గేటు బయట వెయిట్ చేస్తున్నారు"

దట్టంగా కురుస్తున్న మంచు.

ఎవరై వుంటారు. దేశ్‌ముఖ్! నేనేం చేస్తున్నానో తెల్సుకోడానికి వచ్చుంటాడా?

సిద్ధార్థ దగ్గరగా తనని చూసిన మహంత మనిషా?

"నిశాంతా......గుర్తుంచుకో.....ఎప్పుడు ఏ ప్రమాదం......ఎలా వస్తుందో తెలీదు. అప్రమత్తంగా
వుండడం మరిచిపోకు" ఆయన మాటలు గుర్తుకొచ్చాయి.

గబుక్కున వెనకొచ్చి సూట్లోకెళ్ళి పిస్టల్ తీసుకుని పోర్టికోలో కొచ్చి గేటు వైపు నడిచింది.

గేట్‌మేన్ గేటు తెరిచాడు. రోడ్డు మీదకొచ్చింది ఆమె.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది.

చిక్కని చలి..... రోడ్డుకు రెండో వైపున చెట్టుకింద మనిషి అకారం.

ఆ చెట్టు వేపు నడిచింది ఆమె.

ఆ వ్యక్తి స్పష్టంగా కనిపించడంలేదు.

"ఎవరు?"

చీకట్లోంచి ఆ వ్యక్తి బయటికొచ్చాడు.

సిద్ధర్థా.......?!

సాదా కుర్తా, పైజామాలో మంచులో పూర్తిగా తడిసిపోయున్నాడు.

"మీరా........ఇక్కడకెలా వచ్చారు? నేనిక్కడున్నానని ఎలా తెలిసింది?"

ఆమె ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

"నిద్రపట్టలేదు......వచ్చాను."

“ఎలా వచ్చారు?”

“నడిచి.”

మంచు మల్లె మొగ్గల్లా పడుతోంది.

“డిస్టర్బ్ చేశానా మిమ్మల్ని?” మెల్లగా అడిగాడతను.

“లేదు”

“నాతో మీరు ఎక్కడికైనా రాగలరా?”

అతని గురించి పూర్తిగా తెలియడం వల్ల ఆ గొంతులోని అర్థ్రతకు చలించిపోయింది ఆమె.

“ఎక్కడికి?”

“ఎక్కడికో చెప్పలేను. నాతో రావాలి” చిన్న పిల్లాడులా అన్నాడు అతను.

“వ్యాన్ తీసుకొస్తాను.”

“వద్దు నిశాంత” గబుక్కున ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

“వద్దు........కార్లు, వ్యాన్లూ ఏమీ వద్దు......ఈ మంచులో, ఈ వెన్నెలలో నడుద్దాం. నీతోపాటు ఈ నిశ్శబ్దపు రోడ్లమీద భూమిలోకి క్రుంగి పోతున్నట్టుగా కన్పించే హిమాలయాల్ని చూస్తూ” గుసగుస లాడాడు అతను.

ఇది కలా, నిజమా......నిజంగా సిద్ధార్థ రావడం నిజమేనా? ఎలా రాగలిగాడు? ఆలోచిస్తూనే ముందుకడుగేసింది ఆమె.

“నాకు స్నేహం కావాలి. ఇస్తావా?” వెన్నెలలో జలపాతపు ధారలు పాల ధారల్లా కన్పిస్తున్నాయి.

“అదేం నీరా దోసిలితో యివ్వడానికి” నవ్వుతూ అంది ఆమె.

“హృదయం దోసిలితో యిచ్చేదే స్నహం”

“నీకు కవిత్వం వచ్చా?” ఆశ్చర్యపోతూ అడిగిందామె.

“నాకేం తెలీదు......మొట్టమొదటిసారి ఇలాంటి మాటలన్నీ నా నోటంట వస్తున్నాయి నిజం”

“ఇప్పుడు మనల్ని ఎవరైనా చూస్తే స్నేహితులనుకోరు......ప్రేమికులనుకుంటారు. కదా” ఆ మాటకు ఎలా రియాక్ట్ అవుటాడో తెల్సుకోవాలనే అడిగింది ఆమె.

“అవును. ప్రేమ.....లవ్.....ఆ పదాలే హృదయం అకారంలా వున్నట్టుంటాయి. హృదయంలోంచి నేరుగా ఆ పదాలు పుట్టాయేమో. కదూ?”

మంచు వెన్నెలలో మసగ్గా కనిపిస్తున్న అతని వేపు చూస్తూ అతని మాటల్ని వింటోంది ఆమె

“నేనెవరో... ఏమిటో తెలియకుండా నాతో స్నేహం చేయాలనుకోవడము మనం నిజంగా

ఇన్నోసెంట్ సిద్ధార్థ" అమె అంది.

"యూ ఆర్ రాంగ్.....బిజినెస్‌లా లైఫ్ కాలిక్యులేషన్ కాదు. ముఖ్యంగా స్నేహం, లవ్ ఒక వ్యక్తి గురించి ఏమీ తెలియకుండా ప్రేమించడమే ప్రేమ, కళ్ళంట కన్నీళ్ళు తెలిసే వస్తాయా......గుడ్డి కళ్ళకుక్కూడా కన్నీళ్ళొస్తాయి. మనసు గుడ్డికన్నులాంటిది నిశా."

ఆ మాటలంటున్న అతని వేపు ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయిందామె. తను వూహించిన సిద్ధార్థ వేరు, తనకు దేశ్‌ముఖ్ వీడియోలో చూపించిన సిద్ధార్థ వేరు. ఈ సిద్దార్థ వేరు.

"నిశాంతా.....నామీద నీ అభిప్రాయం చెప్పు" అడిగాడతను.

"అభిప్రాయం అంటే?"

"ఒపీనియన్."

"నువ్వు అందగాడివి, తెలివయినవాడివి, గుడ్ ఎట్ హార్ట్.........ఇంకా....."

"ఇంకా............నా కళ్ళు పెద్దవి, నేను తెల్లగా వుంటాను. ఇలాంటివి కాదు నేనడిగింది.... డూ యూ లవ్ మీ ఆర్ నాట్" డైరెక్టుగా అడిగాడు అతను.

"మనసు కంప్యూటర్ కాదు.......ఇప్పుడే చెప్పొద్దులే. ఆలోచించుకుని చెప్పు" చనువుగా ఆమె వడిలో తల పెట్టుకున్నాడు అతను.

అనుకున్నది వేరు, జరుగుతున్నది వేరు. అకస్మాత్తుగా దేశ్‌ముఖ్ జ్ఞాపకం వచ్చాడు. అతనుజ్ఞాపకం రాగానే చలిగాలి రివ్వున వంటికి తగిలినట్టయింది ఆమెకు.

"బావుంది" మెల్లగా అన్నాడతను.

"ఏమిటి?"

"వెన్నెల్నీ, జలపాతాన్నీ నీ వడిలో తల పెట్టుకుని చూడడం."

గబుక్కున చేతి వాచీ వేపు చూసింది ఆమె.

"నాల గున్న రైంది. ఇక వెళ్దామా"

ఆమాటతో గబుక్కున లేచి కూర్చున్నాడతను.

నిశాంత లేచి శాలువా సర్దుకుంది.

"నీతో చాలా మాట్లాడాలనుకున్నాను ఏమీ మాట్లాడలేకపోయాను" ఇద్దరూ పచ్చిక మీదనుంచి రోడ్డు మీదకొచ్చారు.

దారంటా కబుర్లు! తరతరాల మూగతనం తరువాత మాటలు వచ్చిన వాడిలా మాట్లాడేశాడు సిద్ధార్థ.

ఇద్దరూ హోటల్ దగ్గరకొచ్చారు.

"గుడ్‌నైట్" అలవాటుగా చెప్పింది నిశాంత.

"కాదు మేడమ్! గుడ్‌మార్నింగ్" అని వెనుదిరిగాడు సిద్ధార్థ

ఆ అనుభూతికి ఒక రూపం లేదు.  అలా మసక చీకట్లో వెళ్ళిపోతున్న అతని వైపు మౌనంగా చూస్తూ వుండిపోయింది నిశాంత.

మరి నిద్రపట్టలేదు.

సిద్ధార్థ నిజంగా తనను అభిమానిస్తున్నాడా? ప్రేమిస్తున్నాడా?

లేదా తనలాగే అతను కూడా నటిస్తున్నాడా?

మహంత ....... అతని తెలివితేటల గురించి దేశ్‌ముఖ్ చెప్పిన విషయాలు జ్ఞాపకానికొచ్చాయి.

తెల్లారే వరకూ ఆలోచిస్తూనే వుంది నిశాంత.

*    *    *    *    *    *    *    *    *    *    *    *    *

వారం రోజులు గడిచాయి.

దేశ్‌ముఖ్ నుంచి మెసేజ్ రాలేదు.

సిద్ధార్థ కనిపించలేదు.

ఏం జరిగిందో అర్థంకాలేదు నిశాంతకు.

ఆ రోజు రాకపోతే మర్నాడు కెమ్టీఫాల్స్‌కు వెళ్ళాలని నిర్ణయించుకుందామె.

రెస్టారెంట్‌కి వెళ్ళేసరికి మధ్యాహ్నం రెండు గంటలైంది.

లోనికి వెళ్ళగానే తన ఫోటో వైపే తదేకంగా చూస్తున్న సిద్ధార్థ చూసి ఆశ్చర్యపోయింది.

"ఇన్నాళ్ళూ ఎటెళ్ళిపోయావ్?" అడిగాడు సిద్ధార్థ.

"నేనా?"

"అవును. రెండుసార్లు నీ హోటల్‌కి వచ్చాను. హోటల్‌ని వెకేట్ చేసి వూరెళ్ళిపోయావని చెప్పారు."

"ఊరా.........పాడా.........రింట్ టేస్‌లో కెళ్లాను"

"నాకు చెప్పి వెళ్ళాలని తెలీదా?"

కోపంగా అడుతుతున్న అతడిని చూస్తూ ఏం అనాలో తోచక నవ్వేసింది.

"ఏం  నవ్వుతున్నావ్?"

"నువ్వెవరివో తెలీదు.  నీ ఎడ్రస్ తెలీదు.  కనీసం.....నీ ఫోన్ నెంబరు కూడా తెలీదు. ఎలా?" అనడిగి, సిద్ధార్థ చెప్పే జవాబు కోసం నిరీక్షిస్తోంది నిశాంత.

"నా గురించి నీకు వివరాలు చెప్పాలి. అంతేనా?"

"అవును"

"అయితే రాత్రి సరిగ్గా పదిగంటలకి కెమ్టీ ఫాల్స్ దగ్గరకురా చెబుతాను."

"నిజంగా?"

"నిజంగా నిజమే చెప్తాను" అని వెళ్ళిపోయాడు సిద్ధార్థ